sahanamvande.com

epaper.sahanamvande.com

సహానం వందే

హైదరాబాద్ | 23-09-2026 బుధవారం | సంపుటి-02 సంచిక : 155 EDITOR: ROHINI

బాంబే ఐఐటీలో కులోన్మాదకాండ

ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి

- రగిలిపోతున్న విద్యార్థి లోకం
- న్యాయం చేయాలని డిమాండ్లు
- డీన్‌పై వేటు వేసిన యంత్రాంగం

దేశంలోనే అత్యున్నత విద్యాసంస్థగా పేరొందిన ఐఐటీ బొంబాయిలో అసలేం జరుగుతోంది? ఒక విద్యార్థి విషాదాంతం ఐఐటీ క్యాంపస్‌ను ఎందుకు రణరంగంగా మార్చింది? పరీక్షలో కాపీ కొట్టాడనే ఆరోపణల నుంచి మొదలైన ఈ కథ, ఇప్పుడు కుల వివక్ష ఆరోపణలు, ప్రొఫెసర్లపై ఎఫ్ఐఆర్ వరకు ఎలా వెళ్లింది? కాపీ కొట్టడాన్ని సమర్థిస్తూ విద్యార్థులు రోడ్డెక్కారా లేక దీని వెనుక పెద్ద వ్యవస్థాగత లోపాలు ఉన్నాయా? అసలు ఈ వివాదంలో నిజానిజాలు ఏమిటో ఈ స్టోరీలో చూద్దాం.

- సహనం వందే, ముంబై

ఈ నెల 18న ఐఐటీ బొంబాయిలో చదువుతున్న ద్వితీయ సంవత్సరం విద్యార్థి సాహిల్ వాకోడే ఆత్మహత్య చేసుకోవడంతో ఈ వివాదం మొదలైంది. పరీక్ష జరుగుతున్న సమయంలో సాహిల్ తన మొబైల్ ఫోన్ వాడాడని, ప్రశ్నపత్రాన్ని చాట్ జీపీటీకి అప్‌లోడ్ చేసి జవాబులు వెతికాడని యాజమాన్యం ప్రాథమికంగా చెప్పింది. ఆ తర్వాత అతనికి కౌన్సిలింగ్ ఇచ్చామని, ఎలాంటి క్రమశిక్షణా చర్యలు తీసుకోలేదని కూడా పేర్కొంది. అయితే పరీక్ష హాల్ నుంచి సాహిల్‌ను బయటకు పంపేసిన దృశ్యాలు సీసీటీవీలో రికార్డయ్యాయి. ఆ ఘటన జరిగిన కొద్ది గంటల్లోనే సాహిల్ తన గదిలో ప్రాణాలు తీసుకోవడం పెద్ద కలకలం రేపింది.

మూడు రోజుల వరుస నిరసనలు...

సాహిల్ మరణం తర్వాత క్యాంపస్‌లో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. విద్యార్థులు మూడు రోజుల పాటు వరుస నిరసనలకు దిగారు. యాజమాన్యం వ్యవహరించిన తీరుపై, మానసిక ఒత్తిడిని సరిగ్గా హ్యాండిల్ చేయలేకపోయారనే కోణంలో విద్యార్థులు ప్రశ్నించడం మొదలుపెట్టారు. క్యాంపస్‌లో సరైన మెంటల్ హెల్త్ సపోర్ట్, కౌన్సెలింగ్ వ్యవస్థ లేకపోవడమే ఇటువంటి ఘోరాలకు కారణమని విద్యార్థి సంఘాలు మండిపడ్డాయి.

వ్యవస్థాగత లోపాలే కారణం...

ఈ నిరసనలపై బయట రకరకాల ప్రచారాలు మొదలయ్యాయి. కాపీ కొట్టిన విద్యార్థిని వెనకేసుకొస్తూ నిరసనలు చేస్తున్నారని సోషల్ మీడియాలో విమర్శలు వచ్చాయి. దీనిపై స్పందించిన ఐఐటీ బొంబాయి విద్యార్థి ప్రతినిధులు ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. తాము కాపీ కొట్టడాన్ని లేదా ఏ విధమైన అకడమిక్ మోసాన్ని అస్సలు సమర్థించడం లేదని స్పష్టంగా చెప్పారు. తమ పోరాటం చీటింగ్ గురించి కాదని, సాహిల్ మరణం, క్యాంపస్‌లో ఉన్న వ్యవస్థాగత సమస్యలు, విద్యార్థుల రక్షణ గురించేనని తేల్చిచెప్పారు.

బొంబాయి డైరెక్టర్ శిరీష్ కేదారేకు విన్నపం...

విద్యార్థులు తమ డిమాండ్లతో కూడిన 18 అంశాల నివేదికను ఐఐటీ బొంబాయి డైరెక్టర్ శిరీష్ కేదారేకు సమర్పించారు. ఇందులో క్యాంపస్‌లో జవాబుదారీతనం పెంచడం, విద్యార్థులకు సరైన ప్రాతినిధ్యం కల్పించడం, మెడికల్, మెంటల్ హెల్త్ సపోర్ట్ పెంచడం వంటి కీలక అంశాలు ఉన్నాయి. విద్యార్థుల ఒత్తిడిని పర్యవేక్షించేందుకు ఒక స్వతంత్ర వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ డిమాండ్లను డైరెక్టర్ స్వయంగా పరిశీలించి, నిర్దిష్ట గడువులోగా పరిష్కరిస్తామని సంతకం చేసి అంగీకరించారని విద్యార్థులు తెలిపారు.

డీన్‌పై చర్యలు...

ఈ కేసులో ప్రధానంగా నలుగుతున్న పేరు డీన్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ అఫైర్స్ ప్రొఫెసర్ సూర్యనారాయణ. సాహిల్ పరీక్ష రాస్తున్న సమయంలో ఆయనే ఇన్విజిలేటర్‌గా ఉన్నారు. విచారణ పూర్తయ్యే వరకు ఆయన్ను అడ్మినిస్ట్రేటివ్ బాధ్యతల నుంచి తప్పించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. విద్యార్థుల ఒత్తిడికి తలొగ్గిన ఐఐటీ యాజమాన్యం సూర్యనారాయణను డీన్ పదవి నుంచి తక్షణమే తొలగించింది. అయితే విచారణ సాగుతున్నంత కాలం ఆయన ప్రొఫెసర్‌గా మాత్రమే కొనసాగుతారని యాజమాన్యం స్పష్టం చేసింది.

కుల వివక్ష...

ఈ ఘటనకు మరో సున్నితమైన కోణం కూడా తోడైంది. సాహిల్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో ఇది తీవ్ర రూపం దాల్చింది. క్యాంపస్‌లో సాహిల్ కుల వివక్షను ఎదుర్కొన్నాడని, తీవ్ర వేధింపులకు గురయ్యాడని అతని కుటుంబ సభ్యులు ఆరోపించారు. తండ్రి ఫిర్యాదు మేరకు ముంబై పోలీసులు ప్రొఫెసర్ దూల్లాపై ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసు తీవ్రత దృష్ట్యా విచారణను ముంబై క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు.

ఐఐటీ యాజమాన్యం ఖండన...

ఐఐటీ యాజమాన్యం ఈ కుల వివక్ష ఆరోపణలను ఖండించే ప్రయత్నం చేసింది. సాహిల్ తమ ఎస్సీ, ఎస్టీ సెల్‌కు గానీ, అడ్మినిస్ట్రేషన్‌కు గానీ ఎలాంటి ఫిర్యాదు చేయలేదని ఐఐటీ తెలిపింది. అదే సమయంలో మొదట విడుదల చేసిన ప్రకటనలో కొన్ని తప్పులు ఉన్నాయని ఒప్పుకుంటూ ఐఐటీ క్షమాపణలు చెప్పింది. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా విచారణ దశలోనే ఉన్నాయని, ఏ విషయమూ తేలకముందే నిర్ధారణకు రాకూడదని ఐఐటీ స్పష్టం చేసింది.

నిష్పక్షిక విచారణకు డిమాండ్...

మరోవైపు ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ మద్రాస్ ఫ్యాకల్టీ ఫోరమ్‌లు ప్రొఫెసర్ దూల్లాకు మద్దతుగా నిలిచాయి. విచారణ పూర్తయ్యే వరకు మీడియా ట్రయల్స్ వద్దని, ముందుగానే నిర్ణయాలకు వచ్చి ప్రొఫెసర్లను నిందించవద్దని కోరాయి. నిష్పాక్షిక విచారణ జరగాలని ఫ్యాకల్టీ సంఘాలు కోరుతున్నాయి. మొత్తానికి ఐఐటీ బొంబాయిలో జరిగిన ఈ విషాదం కేవలం ఒక విద్యార్థి మరణం మాత్రమే కాదు, విద్యావ్యవస్థలోని లోపాలను, విద్యార్థుల మానసిక ఒత్తిడిని, అధ్యాపకుల బాధ్యతలను మళ్లీ చర్చకు తెచ్చింది.

ప్రాణం తీసుకునేంత ఒత్తిడి ఎందుకు?

ఒత్తిడి, కాపీయింగ్ ఆరోపణలు, నిరసనలు, విచారణలు... ఇలా ఒక ప్రతిష్టాత్మక సంస్థలో జరిగిన ఈ సంఘటన నిజంగా ఆలోచింపజేసేదే. తప్పు చేస్తే శిక్షించాల్సిందే, కానీ ఒక విద్యార్థి ప్రాణం తీసుకునేంత ఒత్తిడి క్యాంపస్‌లలో ఎందుకు ఉంటోంది? విద్యావ్యవస్థలో మార్పులు రావాల్సిన అవసరం నిజంగా ఉందా?

మమితా బైజు... అంకుల్స్ మోజు

మలయాళంలో బెత్లెహేమ్ సూపర్ హిట్

- రికార్డులన్నింటినీ తిరగరాసిన సినిమా
- ఇది ఒక ఏజ్ గ్యాప్ లవ్ స్టోరీ
- క్యూ కడుతున్న కుటుంబ ప్రేక్షకులు

ఒక చిన్న సినిమా వచ్చి ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల కలెక్షన్స్ రాబట్టడం అంటే సాధారణ విషయమా? ఎలాంటి భారీ ఫైట్లు, గ్రాఫిక్స్ లేకుండా కేవలం ప్యూర్ ఎమోషన్స్, హ్యూమర్‌తో ఒక మలయాళ చిత్రం బాక్సాఫీస్‌ని ఊపేసింది. అదే 'బెత్లెహేమ్ కుటుంబ యూనిట్'. అసలు ఈ సినిమా ఆ స్థాయి విజయాన్ని ఎలా సాధించింది? ప్రేక్షకులను థియేటర్లకు రప్పించిన ఆ సీక్రెట్ మ్యాజిక్ ఏంటి? - సహనం వందే, హైదరాబాద్

విశ్వనాథన్ అండ్ సన్స్ సినిమాలో మమితా బైజు చేసిన యాక్షన్ అందరికీ గుర్తుండే ఉంటుంది. సినిమాలు 90 శాతం ఆమె మోసినట్టే లెక్క. ఇక మలయాళ సినిమా ఇండస్ట్రీలో ఇప్పటి వరకు ఉన్న కలెక్షన్ల రికార్డులన్నింటినీ బెత్లెహేమ్ కుటుంబ యూనిట్ తిరగరాసింది. అత్యధిక వసూళ్లు సాధించిన మలయాళ చిత్రంగా చరిత్ర సృష్టించింది. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా చూపించిన ప్రభావం సామాన్యమైనది కాదు. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం దాదాపు 320 కోట్లకు పైగా వసూలు చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. రోజువారీ వసూళ్లలో కూడా ఎక్కడా తగ్గకుండా థియేటర్లలో భారీ రన్స్ సాధించింది. కుటుంబ ప్రేక్షకులు థియేటర్లకు క్యూ కట్టడంతో ఈ విజయం సాధ్యమైంది.

అశ్లీలత, అసభ్యత లేకుండా...

ఈ సినిమా విజయం వెనుక ఉన్న ప్రధాన బలం దాని కథా నేపథ్యం. ఒక ఏజ్ గ్యాప్ లవ్ స్టోరీని చాలా పద్ధతిగా, ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించారు. నివిన్ పౌలీ, మమితా బైజు మధ్య ఉండే కెమిస్ట్రీ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. సాధారణంగా ఇలాంటి కాన్సెప్ట్‌లు కాస్త తేడా కొట్టినా ఇబ్బందిగా మారుతాయి. కానీ ఎక్కడా అశ్లీలత, అసభ్యత లేకుండా చాలా సహజంగా చూపించడంలో డైరెక్టర్ నక్సెస్ అయ్యారు. అందుకే ప్రతీ ఒక్కరూ తమ కుటుంబంతో కలిసి ఈ సినిమాను హాయిగా చూడగలిగారు.

నటనతో మెప్పించిన మమితా బైజు

ఇక కథానాయికగా నటించిన మమితా బైజు తన గ్లామర్, నటనతో మెప్పించింది. ఆష్లీ అనే పాత్రలో ఆమె ఇచ్చిన పర్ఫార్మెన్స్ సినిమాకు కొత్త ఊపిరి పోసింది. ఇంట్రోవర్ట్ గా ఉంటూనే తన ప్రేమను వ్యక్తపరిచే సన్నివేశాల్లో ఆమె చూపించిన పరిణతి ప్రశంసనీయం. నివిన్ పౌలీ వంటి సీనియర్ యాక్టర్ పక్కన ఎక్కడా తగ్గకుండా పోటీపడి నటించింది. ఆమె నటనలోని అమాయకత్వం, చలాకీతనం యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌కు కూడా బాగా నచ్చేసాయి. ఈ ఇద్దరి కాంబినేషన్ తెరకు సరికొత్త అందాన్ని తెచ్చింది.

ప్రేమలు దర్శకుడి ఘనత...

ఈ సినిమా సక్సెస్‌కు అసలైన సూత్రధారి దర్శకుడు గిరీష్ ఏడీ. గతంలో ప్రేమలు వంటి సూపర్‌హిట్ చిత్రాలను అందించిన ఆయన, మరోసారి తన మార్కు ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించారు. చాలా సాధారణమైన సన్నివేశాలను కూడా ఎంతో ఆసక్తికరంగా మలచడం ఆయన ప్రత్యేకత. కథలో అనవసరమైన డ్రామా లేకుండా నేరుగా ఎమోషన్స్‌తో కనెక్ట్ చేశారు. ఆయన ఎంచుకున్న కామెడీ సన్నివేశాలు ప్రతీ ఒక్కరినీ కడుపుబ్బ నవ్వించాయి. దర్శకుడిగా ఆయన మేకింగ్ స్టైల్ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది.

ఎంతో రియలిస్టిక్...

సినిమాలోని డైలాగ్, నేటివిటీ ప్రతి ఒక్కరికీ చాలా బాగా కనెక్ట్ అయ్యాయి. మనం రోజువారీ జీవితంలో చూసే క్యారెక్టర్లను తెరపై చూస్తున్న భావన ప్రేక్షకుడికి కలుగుతుంది. ఫ్రెండ్స్ మధ్య ఉండే సంభాషణలు, కుటుంబ సభ్యుల మధ్య జరిగే చిన్న చిన్న గొడవలు ఎంతో రియలిస్టిక్‌గా ఉన్నాయి. ఏ సన్నివేశంలోనూ కృత్రిమత్వం కనిపించకపోవడం ఈ సినిమా ప్రత్యేకత. మన పక్క ఇంట్లో లేదా మన ఊరిలో జరిగే కథలా అనిపించడమే ఈ సినిమా సాధించిన పెద్ద విజయం. ఆ ఆత్మీయతే ప్రేక్షకులను మళ్లీ మళ్లీ థియేటర్లకు వచ్చేలా చేసింది.

ఐపీఎస్‌ల లీ'ఎంట్రీ' డ్రామా!

ఏపీలో ముగ్గురి సస్పెన్షన్ ఎత్తివేత

- ముంబై నటి జెత్వాని కేసులో ఊరట
- అయినా కొనసాగనున్న క్రిమినల్ కేసులు

ముంబై నటి కాదంబరి జెత్వాని వ్యవహారంలో ఏపీ సీనియర్ ఐపీఎస్ అధికారుల జీవితాలు ఒక్కసారిగా తలకిందులయ్యాయి. 2024లో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంత సంచలనం సృష్టించిందో అందరికీ తెలుసు. మరి ఇప్పుడు ఆ ఐపీఎస్ ఆఫీసర్లకు మళ్లీ పోస్టింగ్‌లు దక్కడం వెనుక అసలు కథ ఏమిటో, ఇప్పుడు వారికి ఎలాంటి విచారణ ఎదురవుతోందో పూర్తిగా తెలుసుకుందాం.

- సహనం వందే, అమరావతి

ఏపీ సర్కార్ ఇటీవల ఒక కీలక నిర్ణయం తీసుకుంది. కేసుల వివాదంలో చిక్కుకుని సస్పెన్షన్‌కు గురైన ఇద్దరు సీనియర్ ఐపీఎస్ అధికారులపై సస్పెన్షన్‌ను ఎత్తివేసింది. 2024లో ప్రభుత్వం ముగ్గురు పోలీస్ అధికారులను సస్పెండ్ చేస్తూ సంచలన ఆదేశాలు ఇచ్చింది. ఆ అధికారుల్లో కాంతి రాణా టాటా, విశాల్ గున్నీ, అప్పటి ఇంటెలిజెన్స్ డీజీపీ పి.సీతారామాంజనేయులు ఉన్నారు. దాదాపు రెండు సంవత్సరాలు గడిచిన తర్వాత ప్రభుత్వం వీరిని మళ్లీ విధుల్లోకి తీసుకుంది.

కొనసాగనున్న క్రిమినల్ కేసులు

సస్పెన్షన్ ఎత్తివేశారు కదా అని వీరికి పూర్తి ఊరట లభించినట్లు కాదు. ఎందుకంటే వీరిపై శాఖాపరమైన విచారణ అలాగే క్రిమినల్ కేసులు ఏమాత్రం ఆగలేదు. అవి నిరంతరాయంగా కొనసాగుతూనే ఉంటాయని ప్రభుత్వం స్పష్టంగా చెప్పింది. కేవలం పరిపాలనాపరమైన కోణంలో మాత్రమే వీరిని మళ్లీ విధుల్లోకి తీసుకుంటూ కొత్త పోస్టింగ్‌లు ఖరారు చేశారు. ఒక రకంగా చెప్పాలంటే కేసులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ అధికారులకు లభించిన ఒక పెద్ద ఊరటగా దీనిని చూడవచ్చు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో...

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఈ ఐపీఎస్ అధికారులు చట్ట ప్రకారం నడుచుకోలేదని అధికార తెలుగుదేశం పార్టీ ఆరోపించింది. వైసీపీ పెద్దల ఆదేశాల మేరకు మాత్రమే అధికారులు గుడ్డిగా పనిచేసారని తీవ్రంగా విమర్శించింది. పోలీసు విధులను పక్కన పెట్టి రాజకీయ ప్రయోజనాల కోసం పెద్దల మాట విన్నారని కూటమి ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ ఐపీఎస్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ఒక నటిని తీవ్ర వేధింపులకు గురిచేశారనే ఆరోపణలు పెద్ద ఎత్తున వచ్చాయి.

అక్రమ అరెస్టు...

నటి కాదంబరి జెత్వానిని అక్రమంగా అరెస్టు చేయడం, ఆమెపై ఒత్తిడి తీసుకురావడం ఈ వివాదానికి మూలకారణం. ఒక మహిళపై అక్రమంగా కేసులు పెట్టి పోలీసు పవర్‌ను దుర్వినియోగం చేశారనే వార్తలు బయటకు రావడంతో రాజకీయం తీవ్ర స్థాయికి చేరింది. అప్పటి పాలకులు చెప్పినట్లు వింటూ నిబంధనలు దాటేశారని అధికారులపై వచ్చిన ఆరోపణలు తీవ్రమైనవి. దీంతో కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తక్షణమే ఈ అధికారులను పక్కన పెట్టేసి విచారణకు ఆదేశించింది.

కెరీర్‌పై పెద్ద ప్రభావం...

సస్పెన్షన్ వేటు పడిన తర్వాత ఈ అధికారుల పరిస్థితి పూర్తిగా దిగజారిపోయింది. ఏళ్ల తరబడి కేసుల విచారణతో వారి కెరీర్‌పై పెద్ద ప్రభావం పడింది. రూల్ బుక్ పక్కన పెట్టి రాజకీయ నాయకుల కోసం పనిచేస్తే ఎలా మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందో ఈ ఘటన నిరూపించింది. అధికారులు కేవలం తమ బాధ్యతలను మాత్రమే నెరవేర్చాలని, రాజకీయం వైపు వెళ్లకూడదని ఈ వ్యవహారం స్పష్టం చేసింది. అయితే రెండు సంవత్సరాల పాటు సుదీర్ఘ కాలం వేచి చూసిన తర్వాత ఇప్పుడు ఈ అధికారులకు విధుల్లోకి చేరేందుకు దారి దొరికింది.